క్లుప్తంగా

హాలియా మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్‌గా యూసుఫ్



హాలియా : హాలియా మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్‌గా మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ యూసుఫ్ నియామకమయ్యారు. ఈ మేరకు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శ్రీదేవి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

అనుమతిలేని పాఠశాలల్లో పిల్లలను చేర్పించొద్దు

హాలియా : ప్రభుత్వ అనుమతులు లేని పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించొద్దని అనుముల మండల విద్యాధికారి కృష్ణమూర్తి అన్నారు. హాలియా పట్టణంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా విద్యార్థుల నుంచి అడ్మిషన్లు తీసుకుంటున్న శ్రీ చైతన్య పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా విద్యార్థుల నుంచి అడ్మిషన్లు తీసుకోవడానికి వీలు లేదని, గ్రామాల్లో కాన్వాసింగ్ చేస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. అనంతరం పాఠశాల ఆఫీస్ రూంను సీజ్ చేశారు.

చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

మిర్యాలగూడ టౌన్ : బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం మిర్యాలగూడలోని బీసీ సంఘం భవనంలో నిర్వహించిన యువజన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రవర్ణాల ఆధిపత్యంలో పాలకులు బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని ఆరోపించారు. రాజకీయ రిజర్వేషన్లు పెంచి బలహీన వర్గాలకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో బీసీ నాయకులు తమ్మడబోయిన అర్జున్, జయరాజ్, రాపోలు పరమేష్, మురళి, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులున్నారు.

పేద విద్యార్థులకు ఉచిత విద్యనందించాలి

మిర్యాలగూడ టౌన్ : కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25శాతం మంది బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉచిత విద్య అందించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు గాదగోని మహేష్ గౌడ్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ సంఘం కార్యాలయంలో నిర్వహించిన విద్యార్థి విభాగం సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం నాయకులు దుర్గయ్య, సురేష్, శరత్, శంకరాచారి, నవీన్, యాదగిరి, ప్రతాప్, శివ తదితరులున్నారు.

నేడు హనుమాన్ జయంతి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని శివాలయం వీధిలో గల భక్తాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం హనుమాన్ జయంతి నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ బుధవారం తెలిపింది. 21 కలశాలతో భక్తాంజనేయస్వామికి పంచామృతాభిషేకంతో పాటు విశేష అలంకరణ ఉంటుందని, 6గంటలకు ఖమ్మంకు చెందిన సుందరకాండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా నిర్వహించనున్నట్లు తెలిపారు.

భక్తాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

మిర్యాలగూడ టౌన్ : హనుమాన్ జయంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని శివాలయం వీధిలో గల శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో బుధవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశాలతో పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు హనుమాన్ చాలీసాను వివరించారు.

సంపదను పెట్టుబడిదారులకు పంచుతున్న మోదీ

కొండమల్లేపల్లి : కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను పెట్టుబడిదారులకు పంచుతోందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ఆరోపించారు. కొండమల్లేపల్లి మండలంలోని చింతకుంట్ల గ్రామంలో నిర్వహించిన సీపీఐ గ్రామ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. దేశంలో అసమానతలు పెరుగుతున్నాయని, 5 శాతం జనాభా కలిగిన కార్పొరేట్, పెట్టుబడిదారులు, బడా వ్యాపారస్తుల సంపద 70 శాతం పెరిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతరం పోరాడుతుందన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి, కల్లు చరణ్‌రెడ్డి, పన్నాల శ్రీనివాస్, వెంకటయ్య, ఐతరాజు కాశయ్య, మధు, ఇద్దయ్య, మీనమ్మ, బుచ్చయ్య, మల్లేష్, రాములు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

జలబిందెలతో ఊరేగింపు



జల బిందెలతో తరలివస్తున్న గ్రామస్తులు


అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల కేంద్రంలో మహిషాసురమర్దిని అమ్మవారి జాతరలో భాగంలో బుధవారం జల బిందేల కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుఝామున గ్రామంలోని ఊర బావి నుంచి జలాన్ని తీసుకువచ్చి ప్రధాన వీధుల్లో ఊరేగించి అమ్మవారిని, మూలవిరాట్‌ను అభిషేకించారు.

ప్రభుత్వ భూములు పరాధీనం!

- నిడమనూరులోని 294 సర్వే నంబర్‌లో కబ్జాకు గురైన 20 ఎకరాలపైగా భూమి
- మాయమవుతున్న గుట్టలు
- జోరుగా తెల్లరాయి తవ్వకాలు



ముప్పారం శివారులోని ఎర్రగుట్ట వద్ద జరుగుతున్న తవ్వకాలు



ఎర్రగుట్ట తవ్వకాలు చేసిన చోట సాగు చేసిన భూమి

నిడమనూరు : నిడమనూరు మండలంలో చెరువులు, గుట్టలు అన్యాక్రాంతమవుతున్నాయి. మండల కేంద్రంలోని 294 సర్వే నంబర్‌లో 20 ఎకరాలపైగా భూమి కబ్జాకు గురైంది. స్థానిక పేదలకు పట్టాలు చేసినా కొన్నేళ్లుగా వారిని నివాసం, సాగు కానీ చేయకపోవడంతో ప్రభుత్వ భూమి పక్కనే ఉన్న వారు కబ్జా చేశారు. ఇదే తరహాలో ఎర్రబెల్లి గ్రామంలో ఎర్రగుట్ట సర్వే నంబరు 494లో 115 ఎకరాల 35 గుంటల భూమి ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో ఉండేది. నేడు కనీసం పది ఎకరాలు కూడా లేదు. అదేవిధంగా ఎర్రబెల్లి గుట్ట వాటర్ ట్యాంకు నిర్మాణానికి 0-35 గుంటలు, బీసీ హాస్టల్‌కు ఎకరం, 5 ఎకరాలు 133 / 32 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి, కొంత ప్రార్థన మందిరానికి మంజూరు చేయగా మిగతా 50 ఎకరాల్లో తెల్ల రాయి తవ్వకాలు చేస్తున్నారు.

కబ్జాకు గురవుతున్న గుట్టలు..

గుంటకగూడెం-ముప్పారం గ్రామాల మధ్య రెండు ఎర్రమట్టి గుట్టలను జాతీయ రహదారులు-167, 565 నిర్మాణానికి పెద్ద ఎత్తున తవ్వకాలు సాగించడంతో 20 ఎకరాలకుపైగా భూమిని కబ్జా చేశారు. కుంటిగొర్లగూడెం- పార్వతీపురం గ్రామాల మధ్య రాతిబోడును 100 ఎకరాలకు పైగా తవ్వేశారు. వెనిగండ్ల -రాజన్నగూడెం గ్రామల మధ్య మూడు గుట్టలు ఉండేవి. ప్రస్తుతం రెండు మాత్రమే పాక్షికంగా ఉండగా, మిగతా రెండు గుట్టలు తవ్వకాలతో స్థానిక పెద్ద మనుషులు కబ్జా చేశారు. రాజన్నగూడెం శివారులోని గుట్ట మట్టిని వెంచర్లకు, ఇతర అవసరాలకు తరలిస్తున్నారు. ముప్పారం, కుంటిగొర్లగూడెం, గుంటిపల్లి గ్రామాల్లో రెవెన్యూ అధికారులు బదిలీ అయ్యే సమయంలో కానీ... రిటైర్‌మెంట్ అయ్యే సమయంలోగాని ప్రభుత్వ భూమిని పట్టా చేసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. వారు బదిలీ కాగానే ఇతర అధికారులపై రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకురావడంతో వారు కూడా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ భూములను కాపాడే వారు లేకుండా పోయారు.

పనులు పూర్తి చేయకుంటే నోటీసులు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



పెద్దవూర పీహెచ్‌సీలో ఓపీని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెద్దవూర: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న హాస్పిటల్ భవనాన్ని (పీహెచ్‌సీ) నెల రోజుల్లో పూర్తి చేయాలని, లేనిపక్షంలో షోకాజ్ నోటీసు జారీ చేస్తానని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. బుధవారం పెద్దవూర మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, భవిత కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్యసిబ్బంది హాజరు పట్టిక, ఓపీ వివరాలు, గర్భిణుల రిజిస్టర్, స్టాక్, మెడిసిన్ రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నూతన భవనాన్ని గత ఫిబ్రవరి నాటికే పూర్తి చేయాలని ఆదేశించినా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమైనా ఎక్విప్‌మెంట్ అవసరం ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని తనిఖీ చేసి మరమ్మతులు చేపట్టాలని, పరిసరాల్లో కంపచెట్లను, మట్టిని తొలగించి శుభ్రం చేయాలని సూచించారు. ర్యాంప్‌తో సహా టాయిలెట్స్, తాగు నీరు, విద్యుత్ వంటి వసతులు కల్పించాలన్నారు. అదేవిధంగా చలకుర్తిలో పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి, ఈ స్థలంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి గల అవకాశాలను పరిశీలించారు. ఆమె వెంట ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ ఎస్పీ రాజ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ సుధీర్‌కుమార్, వైద్యాధికారి నగేష్, ఎంఈఓ తరి రాములు, ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

పెళ్లి కానుక అందజేత

మిర్యాలగూడ: మిర్యాలగూడ మండలం చింతపల్లి పరిధిలోని మహేశ్వరం గ్రామానికి చెందిన కంపసాటి అంజమ్మ కుమార్తె హైమావతి వివాహం సందర్భంగా మాజీ సర్పంచ్ బాణావత్ లక్ష్మీశంకర్ నాయక్ బుధవారం పెళ్లి కానుక కింద రూ.5వేలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పేదింటి ఆడబిడ్డ వివాహానికి తనవంతు సాయం అందిస్తానని తెలిపారు.

మల్టీపర్పస్ సిబ్బందికి హెల్త్ ఇన్సూరెన్స్ చేయిస్తా

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: బీఎల్‌ఆర్ బ్రదర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ మల్టీపర్పస్ సిబ్బందికి ప్రతి సంవత్సరం హెల్త్ ఇన్సూరెన్స్ చేయిస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో పారిశుద్ధ్య, తడిపొడి చెత్త సేకరణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, వర్మి కంపోస్ట్ తయారీపై మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మల్టీపర్పస్ సిబ్బందిని ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ కార్మికులు మెరుగైన సేవలు అందించాలన్నారు. బీఎల్‌ఆర్ బ్రదర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్టీపర్పస్ సిబ్బందికి తన సొంత డబ్బులతో హెల్త్ ఇన్సూరెన్స్ చేయించి ప్రతి సంవత్సరం రెన్యూవల్ చేయిస్తానన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ వెంకటయ్య, డీఎల్‌సీఓ రాఘవేంద్ర, ఎంపీడీఓ శేషగిరిశర్మ, ఎంపీఓ మాతంగి రమేష్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ ఆశయాలు సాధించాలి



దేవరకొండ: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



మిర్యాలగూడ: రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



హాలియా: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దేవరకొండ: రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని ఆయన నివాసంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ యూనూస్, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, హరికృష్ణ, శ్రీనివాస్‌యాదవ్, సురేందర్‌రెడ్డి, నారాయణనాయక్, వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

మిర్యాలగూడ: రాజీవ్‌గాంధీ ఆశయాలను సాధించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పేద, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి పోరాడారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి

హాలియా : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని అనుముల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం హాలియా పట్టణంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. భారతదేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌనీ రాజా రమేష్ యాదవ్, సపావట్ పాండునాయక్, మజహార్ మొహినోద్దీన్, కుందూరు రాజేందర్‌రెడ్డి, జూపల్లి శ్రీనివాస్, బానుచందర్‌రెడ్డి, తక్కెలపల్లి సైదులు, నెర్మటి వెంకట్‌రెడ్డి, రమణయ్య తదితరులున్నారు.

త్రిపురారం : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని బుధవారం త్రిపురారం మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే బాలు నాయక్



వెంకటంపేటలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలు నాయక్

చింతపల్లి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, మారుమూల గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. బుధవారం చింతపల్లి మండల పరిధిలోని తీదేడు, నెల్వలపల్లి, ఉప్పరపల్లి, తిర్మలాపురం గ్రామాల్లో రూ.57లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందించేలా చూస్తున్నామన్నారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని, సకాలంలో రోడ్ల నిర్మాణం పూర్తిచేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరలోనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం నెల్వలపల్లి గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ముచ్చటించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

కొండమల్లేపల్లి: క్రీడాకారులు క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం కొండమల్లేపల్లి మండలంలోని కొల్‌ముంతలపహాడ్, మంత్రియ తండాలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఆలంపల్లి నర్సింహ, వేమన్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, యాదగిరి, రవినాయక్, లాలునాయక్ పాల్గొన్నారు.

నర్సరీలో మొలకెత్తని విత్తనాలు



పెండ్లిపాకలలోని వన నర్సరీలో విత్తనాలు మొలకెత్తకుండా ఖాళీగా దర్శనమిస్తున్న మట్టి నింపి ఉంచిన కవర్లు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల పరిధి పెండ్లిపాకల గ్రామపంచాయతీలోని వన నర్సరీ కేంద్రంలో పలు విత్తనాలు మొలకెత్తలేదు. వర్షాలు ప్రారంభం కాగానే రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో అధికారులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. అయితే ఆ సమయానికి వన నర్సరీ కేంద్రాల్లోని మొక్కలు చేతికందేలా లేవు. నాసిరకమైన విత్తనాలు నాటడంతో పలు విత్తనాలు మొలకెత్తలేదు. పెండ్లిపాకలలోనే కాకుండా చాలా గ్రామాల్లో విత్తనాలు మొలకెత్తకుండా మట్టి నింపి ఉంచిన ఖాళీ కవర్లే దర్శనమిస్తున్నాయి.

సొసైటీని విచ్ఛిన్నం చేసేందుకు అసత్య ఆరోపణలు



మాట్లాడుతున్న భిక్షానాయక్

మిర్యాలగూడ: ఎఫ్‌సీఐ హమాలీ వర్కర్స్ కోఆపరేటివ్ సొసైటీని విచ్ఛిన్నం చేసేందుకు డీపీఎస్ కార్మికులు కావాలని సొసైటీపై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని ఎఫ్‌సీఐ హమాలీ వర్కర్స్ కోఆపరేటివ్ సొసైటీ (సీఐటీయూ) అధ్యక్షుడు భిక్షానాయక్ అన్నారు. బుధవారం మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎఫ్‌సీఐ హమాలీ వర్కర్స్ లేబర్ కాంట్రాక్ట్ సహకార సంఘం పేరున హమాలీ కార్మికుల ఇళ్ల స్థలాల కోసం గతంలో 16.20 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. హమాలీలకు ఉపాధి పొందేందుకు గతంలో 6.32 ఎకరాల్లో గోదాం నిర్మాణం కోసం విక్రయించామన్నారు. ఆ తరువాత సొసైటీ సభ్యుల అనుమతితో 1.30 ఎకరాల భూమిని తిరుపతమ్మకు విక్రయించగా ఆ డబ్బులను సభ్యులందరూ పంచుకున్నారన్నారు. ప్రస్తుతం సొసైటీ పరిధిలో 8.20ఎకరాల భూమి ఉందని ఆ భూమిని ఎవరూ కూడా ఎవరికి అమ్మలేదని తెలిపారు. సొసైటీకి సంబంధంలేని డీపీఎస్ కార్మికులు కావాలని సొసైటీని విచ్ఛిన్నం చేసేందుకు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు, ఎఫ్‌సీఐ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు మాలోతు లాలు, చిన్న రవి, దీప్లా బిల్లు, చందర్, విజయ్, ఛత్రు, బాలోజీ, శంకర్, రామారావు, చిన్న, చిన్న బాల, కృష్ణ తదితరులున్నారు.

మాజీ ఎమ్మెల్యే భగత్ వ్యాఖ్యలు అర్థరహితం



మాట్లాడుతున్న మార్కెట్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్

హాలియా : సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని హాలియా వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్ యాదవ్ అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేపై ఎలాంటి ఆధారాలు లేకుండా నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు గౌనీ రాజా రమేష్ యాదవ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు భానుచందర్‌రెడ్డి, జవహర్ నాయక్, నకిరేకంటి సైదులు మాదగి, చెరుపల్లి ముత్యాలు, మజహార్ మొహినుద్దీన్, అన్వరుద్దీన్, మహేష్ తదితరులున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ: యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికుల సౌకర్యార్థం మిర్యాలగూడ నుంచి వీర్లపాలెం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జెన్‌కో కార్యదర్శి చారుగుండ్ల రమేష్ బుధవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి బస్సు నడపాలని సూచించారు. వినతిపత్రం అందజేసిన వారిలో బొడెడ్ల శ్రీనివాస్, మల్లెల వీరనారాయణ, నాదెళ్ల రవికుమార్, సోందు తదితరులున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రామలింగం

పెద్దఅడిశర్లపల్లి : బీజేపీ మండల అధ్యక్షుడిగా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అక్కంపల్లి గ్రామానికి చెందిన వలసాని రామలింగం ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

మల్లూసర్‌కు నివాళి



మల్లూసర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్: సీపీఎం సీనియర్ నాయకుడు, రైతు సంఘం మండల నాయకుడు షేక్ మల్లూసర్ ఆశయాలను సాధించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలంలోని ఉట్లపల్లి గ్రామంలో షేక్ మల్లూసర్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, ముడావత్ రవినాయక్, శశిధర్‌రెడ్డి, అయూబ్, మాజీ సర్పంచ్ నాగుల్ హుస్సేన్, శ్రీనివాస్, మన్మధరెడ్డి, హరికుమార్, శ్రీనివాసరావు, సుంకరి రమణ, మాతంగి రావి, ఇరుగు నాగయ్య, అంతయ్య, దుండిగాల అంజయ్య పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు నాగార్జునకు నివాళి

మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్‌నగర్‌తండాకు చెందిన సీపీఎం నాయకుడు, రైస్‌మిల్ డ్రైవర్ యూనియన్ నాయకుడు పేరాల నాగార్జున(54) బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన మృతదేహానికి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ నివాళులర్పించారు. ఆయన వెంట మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, పరశురాములు, అయూబ్, రామ్మూర్తి, మల్లయ్య, కరీం, రామారావు తదితరులున్నారు.

మినీ రిజర్వాయర్‌గా నిడమనూరు చెరువు

- హాలియా, నిడమనూరుకు తాగునీటి సరఫరా



నిడమనూరు చెరువు

నిడమనూరు : నిడమనూరు చెరువు మినీ రిజర్వాయర్‌గా మారనుంది. గతంలో నల్లగొండ పట్టణానికి తాగు నీరు అందించిన తరహాలో హాలియా మున్సిపాలిటీకి, నిడమనూరు మండల కేంద్రానికి తాగునీరు అందించే ప్రణాళికలు రూపొందించాలని ప్రజాప్రతినిధుల నుంచి చాలాకాలంగా డిమాండ్ ఉంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మిషన్ భగీరథ పథకం తాగునీటి అవసరాలు తీర్చలేకపోతుంది. ఈనేపథ్యంలో ఇటీవల మిర్యాలగూడలో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, నీటిపారుదల, గ్రామీణ పారుదల శాఖ అధికారుల దృష్టికి ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి తీసుకెళ్లారు. ఈమేరకు చెరువు నీటి వినియోగం, సాగర్ ఎడమ కాల్వ నుంచి నీరందించే ముప్పారం మంచినీటి పథకాన్ని పరిశీలించేందుకు బుధవారం కలెక్టర్ పర్యటించాల్సి ఉంది. అయితే వర్షం రావడంతో కలెక్టర్ పర్యటన రద్దయింది. చెరువును అభివృద్ధి చేసి మినీ రిజర్వాయర్‌గా రూపొందించే ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే త్వరలో నిడమనూరు చెరువు మినీ రిజర్వాయర్‌గా మారనుంది.

విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నంబర్లు మార్పు

డీఈ ఆపరేషన్ మిర్యాలగూడ : 87124 69394	ఏఈ వేములపల్లి : 87124 69406
ఏడీఈ మిర్యాలగూడ: 87124 69396	ఏఈ ఆపరేషన్ హాలియా: 87124 69407
ఏడీఈ మిర్యాలగూడ రూరల్ : 87124 69397	ఏఈ నాగార్జున సాగర్ : 87124 69408
ఏఈ హాలియా : 87124 69398	డీఈ ఆపరేషన్ దేవరకొండ: 87124 69453
ఏఈ దామరచర్ల: 87124 69399	ఏడీఈ దేవరకొండ : 87124 69454
ఏఈ త్రిపురారం: 87124 69400	ఏడీఈ చందంపేట : 87124 69455
ఏఈ మిర్యాలగూడ రూరల్: 87124 69401	ఏఈ డిండి: 87124 69457
ఏఈ పెద్దవూర : 87124 69402	ఏఈ దేవరకొండ: 87124 69458
ఏఈ మిర్యాలగూడ టౌన్ -1 87124 69403	ఏఈ పీఏపల్లి: 87124 69459
ఏఈ మిర్యాలగూడటౌన్ 2- 87124 69404	ఏఈ గుర్రంపోడు: 87124 69464
ఏఈ నిడమనూరు - 87124 69405	ఏఈ చింతపల్లి: 8712469465
	కొండమల్లేపల్లి: 87124 69496
	నేరెడుగొమ్ము : 87124 69515

రైతులను ఆదుకోవాలి

మిర్యాలగూడ అర్బన్: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను రైతులు ఐకేపీ కేంద్రాలకు తెచ్చి నెలరోజులు కావస్తున్నా.. ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

సన్నబియ్యం సరఫరా సక్రమంగా జరగాలి

నిడమనూరు : ప్రజాపంపిణీలో భాగంగా సన్నబియ్యం సక్రమంగా అందించాలని తహసీల్దార్ జంగాల కృష్ణయ్య రేషన్ డీలర్లకు సూచించారు. బుధవారం స్థానికంగా రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు రేషన్ కార్డు ఉంటే తొలగించాలని, చనిపోయిన వారి పేర్లు కూడా తొలగించాలన్నారు. ప్రతి లబ్ధిదారుడి ఈకేవైసీ పూర్తిచేయాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు సందీప్, రాజీరెడ్డి, డీలర్ల సంఘం నాయకులు సంకూరి నాగేశ్వర్ రావు, కందుల సైదమ్మ, కామిశెట్టి సత్యం, సైదాచారి తదితరులున్నారు.